క్లుప్తంగా

నేడు కొత్తూరులో మంత్రి రాజా పర్యటన

తుని రూరల్: మండలంలోని కొత్తూరులో గురువారం రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా రాజా పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

గోకవరం: గ్రామీణ ప్రాంతాల్లో యువతను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గోకవరం మండలంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను స్థానిక నాయకులు, అధికారులు పర్యవేక్షించారు.

ఘనంగా సావిత్రీ బాయి ఫూలే జయంతి



ప్రత్తిపాడులో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సావిత్రిబాయి ఫూలే జయంతిని నిర్వహించారు. తొలుత సావిత్రిభాయి ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతు మహిళల అభ్యున్నతి కోసం సావిత్రిభాయి ఫూలే విశేష కృషి చేశారన్నారు. మహిళల కోసం విద్యాలయాలను స్థాపించి వారి ఉన్నతికి పాల్పడ్డారన్నారు. అనంతరం తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ చేతుల మీదుగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పులి ప్రసాద్, జేబీ రాజు, ఎంపీ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఇజ్జిన మల్లి, దళిత ప్రజాశక్తి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మురారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: సావిత్రీభాయి ఫూలే జయంతిని ప్రత్తిపాడులో బుధవారం నిర్వహించారు. స్థానిక మినర్వా విద్యా సంస్థల ఆవరణలో సావిత్రిభాయి చిత్రపటానికి పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఆర్‌బీ చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళల కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుజన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాజేంద్ర మృతి



రాజేంద్ర (ఫైల్)

ఏలేశ్వరం: సుజన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కె.రాజేంద్ర (58) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. రాజేంద్రకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రజా ఉద్యమాల నేతగా రాజేంద్ర ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారు. రాజేంద్ర మృతికి పలువురు నాయకులు, ప్రజాసంఘాల నేతలు సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గంపేట: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై నాగార్జునరాజు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని ఇర్రిపాకకు చెందిన గులిమి చిన్నఅప్పారావు (77) బుధవారం తన పొలంలోకి సైకిల్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నఅప్పారావు తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బంధువులు చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో బుధవారం రాత్రి బైక్ చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఏలేశ్వరం మండలంలో సర్వేయరుగా పనిచేస్తున్న ఏలేశ్వరం గ్రామానికి చెందిన మురళి(25), సిరిపురం గ్రామానికి చెందిన సతీష్ బైక్‌పై ఏలేశ్వరం నుంచి ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో జరుగుతున్న ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. వారు తిరిగి వస్తుండగా లంపకలోవ గ్రామ సమీపాన బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో మురళి అక్కడికక్కడే మృతి చెందగా సతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాన్ని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన సతీష్‌ను స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

● సీఎం జగన్‌కు ఘన స్వాగతం









ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సామాజిక పింఛన్లను రూ.3 వేలకు పెంచింది. కాగా వైఎస్సార్ పింఛను కానుక పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కాకినాడ వచ్చారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు, జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, అతని కుమారుడు తోట రాంజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

ఆనంద మనిపింఛన్

- పింఛను సొమ్ము రూ.3 వేలకు పెంపు
- అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వులు
- తుని మండలంలో 12,873 మందికి లబ్ధి

అవ్వాతాతలు..అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర కానుక అందించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛనును ఏటా పెంచుకుంటూ వెళ్లారు. 2019లో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వెంటనే పింఛను రూ.2,250 పెంచారు. 2022 జనవరిలో రూ.2,500, గతేడాది జనవరి నుంచి రూ.2,750 చేశారు. పెంచిన పింఛన్లతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లకు లబ్ధి చేకూతుంది. ముఖ్యమంత్రి నిర్ణయంతో సామాజిక పింఛనుదారుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

తుని రూరల్: నూతన సంవత్సరం ప్రారంభంతోనే అవ్వాతాతలకు, అక్కచెల్లెమ్మల ముఖాల్లో చిరునవ్వులు వెలిశాయి. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ నెరవేర్చుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచడమే కాకుండా జిల్లా కేంద్రం కాకినాడలో బుధవారం లాంఛనంగా వైఎస్సార్ పింఛన్ కానుక పథకాన్ని ప్రారంభించారు. పెరిగిన పింఛన్ మొత్తం ఈ నెల నుంచి అందించడంతో పాటు అర్హులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. జనవరి నుంచి పాత, కొత్త పింఛన్‌దారులంతా నెలకు రూ.3 వేలు పెన్షన్ కంచన్‌గా అందుకోనున్నారు.



తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో షేక్ ఖాదర్ వల్లికి పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్

తుని మండలంలో పాత, కొత్త పింఛన్‌దారుల వివరాలు

గ్రామం	పాత పింఛన్లు	మంజూరైన పింఛన్లు	గ్రామం	పాత పింఛన్లు	మంజూరైన పింఛన్లు
చామవరం	411	11	ఎస్ఎస్‌వీ.నగరం	335	12
చేపూరు	236	7	ఎన్.సూరవరం	379	9
డి,పోలవరం 1	585	10	రాపాక	408	7
డి.పోలవరం 2	540	19	రేఖవానిపాలెం	426	15
దొండవాక	417	18	ఎస్.అన్నవరం 1	405	11
హంసవరం-1	579	22	ఎస్.అన్నవరం 2	393	11
హంసవరం-2	405	10	ఎస్.అన్నవరం 3	539	27
కేఓ.మల్లవరం-1	398	19	ఎస్.అన్నవరం 4	288	4
కేఓ.మల్లవరం-2	410	10	తాళ్లూరు	471	15
కొలిమేరు	507	11	తేటగుంట-1	766	54
కొత్తూరు-1	732	19	తేటగుంట-2	383	10
కొత్తూరు-2	613	6	తిమ్మాపురం	731	17
కొత్తూరు-3	359	11	వల్లూరు	474	8
కుమ్మరిలోవ	290	9	మొత్తం	12,490	383

ధైర్యంగా బతుకుతున్నాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పింఛన్ డబ్బుతో ధైర్యంగా బతుకుతున్నాను. చౌకధరల దుకాణంలో బియ్యం తీసుకుని, ఇతర ఖర్చులకు పింఛన్ డబ్బులు వాడుకుంటున్నాను. నెలలో మొదట తారీఖునే వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తోంది. పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచడం సంతోషంగా ఉంది.

– ఎం.రాజేశ్వరి, పింఛన్‌దారు, తుని

383 మందికి కొత్తగా పింఛన్లు



మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో అర్హులైన 383 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి అర్హులందరికీ ఈ–కేవైసీ చేస్తున్నాం. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చేతులమీదుగా కొత్త పింఛన్లు లబ్ధిదారులకు అందజేస్తాం.

– పి.రవికుమార్, ఎంపీడీఓ, తుని

23 పంచాయతీల పరిధిలో

తుని మండలంలో 23 పంచాయతీల పరిధిలో 27 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల పరిధిలో 2023 డిసెంబర్ వరకు 12,490 పింఛన్లు ఉండగా మరో 383 కొత్త పింఛన్ల మంజూరు చేశారు. దీంతో పింఛన్‌దారుల సంఖ్య 12,873కి చేరింది. లబ్ధిదారులకు నెలకు రూ.3.82 కోట్లు అందనుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019కి ముందు తుని మండలంలో 8,243 మంది మాత్రమే పింఛన్‌దారులు ఉండేవారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రస్తుతం 12,873 మందికి పింఛను అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆదరణ కరువైన అభాగ్యులకు ప్రభుత్వం పెంచిన పింఛన్ డబ్బుతో ధైర్యంగా జీవించే భరోసా లభించింది.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా శ్యామ్‌కుమార్



ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశానికి హాజరైన నాయకులు

తుని: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా ముప్పిడి శ్యామ్‌కుమార్ నియమితులయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందాకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కత్తిపూడిలో బుధవారం రాష్ట్ర కార్యదర్శి కాకడ నూకరాజు అధ్యక్షతన సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఎంఈఎఫ్ అధ్యక్షుడు దూలపల్లి సుబ్బారావు మాదిగ, కోస్తాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ సభ్యులు రాష్ట్ర కార్యదర్శిగా శ్యామ్ కుమార్ మాదిగను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా ఆరుగుల సతీష్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ



జి.కొత్తపల్లిలో అయోధ్య రాముని అక్షతల పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో బుధవారం గడపగడపకూ అయోధ్య రాముని అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పల్లా శ్రీను, కోన బాబ్జి, ఉప్పల రామగోపాల్ తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి శ్రీరాముని జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను ప్రజలకు అందజేశారు. ఈ నెల 22న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం రోజున ఈ అక్షతలను శిరస్సుపై వేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు గదుల శ్రీను, ఈగల రమణ, పల్లా పెద్ద శ్రీను, దోమాడ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో విజయం సాధిస్తా

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- జగ్గంపేటలో విలేకర్ల సమావేశం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం



దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తోట రాంజీ

గండేపల్లి: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, అతని అనుయాయులను కలుపుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపుకు కృషి చేస్తానని పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలో బుధవారం వైఎస్సార్ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి నివాసం వద్ద ఆయన తన అనుచరులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కాకినాడ పర్యటనలో కలిసి పార్టీ గెలుపు గురించి సూచనలు, సలహాలు తీసుకున్నట్టు చెప్పారు. జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమానికి పాటు పడతానన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి కార్యకర్తలు, కేడర్‌ను పటిష్టం చేశామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే చంటిబాబుకు, తనకు ఎలాంటి విబేధాలు లేవని స్పష్టం చేశారు. పార్టీ గెలుపు కోసం ఎమ్మెల్యే చంటిబాబుతో కలిసి పనిచేస్తానన్నారు. తొలుత నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు అందని పేదలకు స్థలాలు మంజూరు చేయిస్తామని తెలిపారు. అనంతరం గ్రామ దేవత రావులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. జగ్గంపేటలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విలేకర్ల సమావేశంలో ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ గుల్లా ఏడుకొండలు, పార్టీ సీనియర్ నాయకులు అత్తులూరి సాయిబాబు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మూర్తి, పార్టీ గండేపల్లి మండలాధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, పార్టీ నాయకులు కుంచె చినబాబు తదితరులు పాల్గొన్నారు.

కేడర్‌లో నూతనోత్సాహం

మాజీ మంత్రి, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం వర్గీయుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా నరసింహాన్ని నియమించడంతో ఆయన అనుయాయులు బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



రమణ (ఫైల్)

గండేపల్లి: అదృశ్యమైన వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని మల్లేపల్లికి చెందిన బళ్ల రమణ (40) గతేడాది డిసెంబర్ 29న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో అతని భార్య జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గ్రామంలో పోలవరం కాలువ వద్ద మట్టి దిబ్బలపై గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్టు స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అది రమణ మృతదేహంగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమగ్ర భూసర్వేలో తప్పులు సరిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కౌలూరి పతిరాజు

ప్రత్తిపాడు: సమగ్ర భూసర్వేలో జరుగుతున్న తప్పులను సరిదిద్దాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి కౌలూరి పతిరాజు కోరారు. స్థానిక మునసబు గారి రామాలయం ఆవరణలో బుధవారం సాయంత్రం భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హజరైన కౌలూరి పతిరాజు మాట్లాడుతూ మిచాంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లో వెంటనే నష్ట పరిహారం జమ చేయాలన్నారు. బీకేఎస్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని సూచించారు. బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను నరికివేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు సదరు రైతుకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంపై ఆధారపడినవారంతా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో వాటాదారులుగా చేరి, తద్వారా వచ్చే లాభాలు పొందాలని సూచించారు. బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సభలో బీకేఎస్ నాయకులు కాకిలేటి వీర్రాజు, భేరి రాము, మొండి సత్యనారాయణ, పంది వీరభద్రరావు, వరుపుల నాగేశ్వరరావు, తోలేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన వరుపుల సుబ్బారావు



రత్నగిరిపై సత్యదేవుని దర్శించిన వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ సుబ్బారావు

తొండంగి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు కుటుంబ సమేతంగా బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కో ఆర్డినేటర్‌గా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో సత్యదేవుడు, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తానని తెలిపారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

తెలుగు మహాసభలకు తరలివెళ్లిన సత్యదేవుని శాంతి రథం

తొండంగి: రాజమహేంద్రవరంలో గురువారం నుంచి ఈ నెల 8 వరకూ నిర్వహించే ఆంధ్రప్రదేశ్ తెలుగు మహా సభలకు సత్యదేవుని శాంతి రథం బుధవారం తరలివెళ్లింది. ఈ మేరకు సత్యదేవుని, అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాంతి రథంపై ఉంచి రాజమంహేంద్రవరం తీసుకెళ్లారు. అలాగే తాడేపల్లిగూడెంలో శాంతి కల్యాణం నిర్వహించేందుకు ఈ రథం వెళుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

సంక్షేమ ప్రదాతకు మరో అవకాశం ఇవ్వండి



తుని మార్కండ్రాజుపేట సచివాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుని: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా మరోసారి అవకాశం ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కోరారు. పట్టణంలోని 29, 30 వార్డు సచివాలయాల పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయాల్లో సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలను తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఆయా వార్డుల్లో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని చైర్‌పర్సన్ సుధారాణి ప్రారంభించారు. వైద్య శిబిరంలో పలువురు ప్రజాప్రతినిధులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు దోసపర్తి రాజేశ్వరి, సిద్దిరెడ్డి గౌరీవనజ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టో నూరు శాతం అమలు



ఏలేశ్వరంలో పెన్షన్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ఎన్నికల మేనిఫెస్టోను నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో వృద్ధులు, వితంతువులకు అందించే సామాజిక పింఛనును రూ.3 వేలకు పెంచడంతో స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం పెన్షన్ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, పార్టీ నేతలు నీరుకొండ సత్యనారాయణ, అలమండ చలమయ్య, సుంకర రాంబాబు, దాసరి రమేష్, నీరుకొండ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

- నలుగురి అరెస్టు, ముగ్గురు పరారీ
- వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో బుధవారం విస్తృతంగా దాడులు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో 120 లీటర్ల సారాతో నలుగురు పట్టుబడగా మరో ముగ్గురు పరారయ్యారన్నారు. వివరాల్లోకి వెళితే...ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో 10 లీటర్ల సారాతో పోసపల్లి పాపమ్మను, కిర్లంపూడి మండలం గోనేడలో 20 లీటర్ల సారాతో కర్రి వీరబాబును, శంఖవరం మండలం కత్తిపూడిలో 30 లీటర్ల సారాతో బోడపాటి గోవిందును, 10 లీటర్ల సారాతో ఎద్దు రాజును అదుపులోకి తీసుకున్నారు. శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు గ్రామ సమీపంలోని సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలాల నుంచి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో కేసనకుర్తి లోవరాజు, పింకి బ్రహ్మానందం కుమారుడు తాతీలు, పింకి పెద అప్పారావు కుమారుడు తాతీలు పరారయ్యారన్నారు. వీరిపై పరారీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ పి.సునీల్‌కుమార్, సెబ్ ఇంటిలిజెన్స్ విభాగం సీఐ కె.గిరిధర్, సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.